
సాక్షి పల్నాడు

మంగళవారం । 11 । మార్చి । 2025



రోడ్ల నాణ్యత పరిశీలన

తెనాలిఅర్బన్: తెనాలి పట్టణంలో ఇటీవల నిర్మించిన పలు రోడ్లను క్వాలిటీ కంట్రోల్ బృందం సోమవారం పరిశీలించింది. వాటి నాణ్యత ప్రమాణాలను చెక్ చేసింది.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 523.00 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడికాలువకు 8,023 క్యూసెక్కులు విడుదలవుతోంది.



ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

ఫిరంగిపురం: మండలంలోని కండ్రిక గ్రామ శివారు రేగులగడ్డలో వందేళ్లనాటి సీతారామ చంద్రస్వామి ఆలయం పునర్నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన పూజలు చేశారు.



న్యూస్‌రీల్

ఎయిమ్స్‌కు, పానకాల స్వామి కొండకు ఎలక్ట్రిక్ బస్సులు

మేఘా ఇంజినీరింగ్ కంపెనీ వితరణ



మంగళగిరి: మంగళగిరిలోని పానకాల లక్ష్మీ నృసింహస్వామి కొండతోపాటు ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్)కు రెండు ఎలక్ట్రిక్ బస్సులను మేఘా ఇంజినీరింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంపెనీ సోమవారం అందజేసింది. బస్సులను రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ ప్రారంభించారు. మేఘా ఇంజినీరింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సీఎస్ఆర్ నిధుల ద్వారా రూ.2.4 కోట్ల విలువైన రెండు అత్యాధునిక ఎలక్ట్రిక్ బస్సులను అందజేసింది. ఈ బస్సుల్లో ఒకటి మంగళగిరి బస్టాండ్ నుంచి ఎన్ఆర్ఐ జంక్షన్, డీజీపీ ఆఫీసు మీదుగా ఎయిమ్స్‌కు వెళ్తుంది. మరొకటి మంగళగిరి బస్టాండ్ నుంచి ఎన్ఆర్ఐ జంక్షన్ మీదుగా శ్రీ పానకాలస్వామి కొండకు వెళ్తుంది. ఒలెక్ట్రా గ్రీన్ టెక్ లిమిటెడ్ చైర్మన్, ఎండీ కేవీ ప్రదీప్, ఎయిమ్స్ డైరెక్టర్ శాంతా సింగ్, డిప్యూటీ డైరెక్టర్ శశికాంత్, ఆలయ ఈవో ఏ రామకోటిరెడ్డి, టీటీడీ బోర్డు సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి, పద్మశాలీ కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య పాల్గొన్నారు.

ఆర్టీసీ జిల్లా ప్రజా రవాణా అధికారిగా మధు



నరసరావుపేట: ఏపీఎస్ ఆర్టీసీ జిల్లా ప్రజా రవాణా అధికారి(ఆర్ఎం)గా ఎం. మధు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. స్థానిక డిపో కార్యాలయంలోని జిల్లా కార్యాలయానికి వచ్చిన ఆయనకు పలువురు ఉద్యోగులు, యూనియన్ నాయకులు స్వాగతం పలికారు. విజయవాడలోని హెడ్ ఆఫీసులో పనిచేస్తూ పదోన్నతిపై పల్నాడు జిల్లాకు వచ్చారు. కాగా ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన ఎన్వీ శ్రీనివాసరావు గత నెల 28న ఉద్యోగ విరమణ చేశారు.

ఇంటర్ పరీక్షల్లో మాల్ ప్రాక్టీసు కేసు నమోదు

గుంటూరు ఎడ్యుకేషన్: ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షల్లో సోమవారం తొలి మాల్ ప్రాక్టీసు కేసు నమోదైంది. పబ్లిక్ పరీక్షల్లో భాగంగా సోమవారం జరిగిన ద్వితీయ సంవత్సరం గణితం-2బీ పరీక్షకు గుంటూరు జిల్లాలోని 87 పరీక్షా కేంద్రాల పరిధిలో 28,274 మంది విద్యార్థులు హాజరయ్యారు. 446 మంది గైర్హాజరయ్యారు. గుంటూరులోని ప్రభుత్వ వృత్తి విద్యా జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలో కాపీయింగ్‌కు ప్రయత్నించిన ఓ విద్యార్థిపై అధికారులు మాల్ ప్రాక్టీసు కేసు నమోదు చేశారు. ఆర్ఐవో జీకే జుబేర్ ఐదు పరీక్షా కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించారు.

సీఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలన



మంగళగిరి: సీఎం చంద్రబాబు నాయుడు మంగళవారం మంగళగిరి మండలంలోని నీరుకొండ గ్రామంలో ఉన్న ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో పర్యటించనున్న నేపథ్యంలో ఏర్పాట్లను కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి సోమవారం పరిశీలించారు. సంయుక్త కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ, తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహ, ముఖ్యమంత్రి భద్రతా సిబ్బంది, అధికారులతో కలిసి ఆమె వర్సిటీని సందర్శించారు. సీఎం ప్రారంభించనున్న సీవీ రామన్ బ్లాక్, ప్రసంగించనున్న అబ్దుల్ కలామ్ ఆడిటోరియం తదితర ప్రదేశాలను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. వర్సిటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ నారాయణ రావు, ప్లానింగ్ ఈడీ వీఆర్ అలపర్తి, సెక్రటరీ అనంత్ సింగ్, రిజిస్ట్రార్ ఆర్. ప్రేమ్‌కుమార్, సీఎల్ఎం డైరెక్టర్ అనూప్‌సింగ్, జీఎం రమేష్‌బాబు పాల్గొన్నారు.

హక్కులు లేక తిప్పలు

భూములున్నా వాటిపై హక్కులు లేని వైనం

- నూజెండ్ల మండలం అగ్రహారంలో వైచిత్రి
- భూహక్కుల కోసం పోరాడుతున్న రైతులు
- దశాబ్దాలుగా పరిష్కారం కాని సమస్య
- క్రయవిక్రయాలకు లేక, ప్రభుత్వ ప్రోత్సాహకాలు అందక తీవ్ర ఇక్కట్లు



రీసర్వే పనులు చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

నూజెండ్ల: అగ్రహారం భూములు కల్గిన రైతులు భూహక్కుల కోసం కొన్ని తరాలుగా ఎదురుచూస్తున్నారు. ఈ భూములపై హక్కులు పొంది ప్రభుత్వపరంగా అనుమతులు పొందాలనే ఉద్దేశంతో రైతులు చేస్తున్న ఉద్యమాలు దశాబ్దాలు దాటుతున్నా ఫలితం మాత్రం కనిపించడం లేదు. వివరాల్లోకి వెళితే.. నూజెండ్ల మండలంలోని వి.అప్పాపురంలో 2055 ఎకరాలు, కొండప్రోలులో 478 ఎకరాలు, తిమ్మాపురం గ్రామంలో 1834 ఎకరాల ఈనాం భూములు ఉన్నాయి. ఈ భూముల రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలు నేటివరకు మంజూరు కాకపోవటంతో బ్యాంకు రుణాలు, ప్రభుత్వం అందించే రాయితీలు అందడం లేదు. ఈ-క్రాప్ నమోదు లేకపోవటంతో ప్రభుత్వ ప్రోత్సాహాలు, రాయితీ, పంట బీమా సౌకర్యాలు అందడం లేదు. భూముల క్రయ విక్రయాలు జరగక రైతుల కష్టాలు వర్ణనాతీతం. సమస్య పరిష్కారం కోసం రెవెన్యూ అధికారుల చుట్టూ తిరగటం మినహా ఉపయోగం లేదని రైతులు వాపోతున్నారు.

చొరవ తీసుకున్న గత ప్రభుత్వం..



రీసర్వే పనులు ప్రారంభిస్తున్న అప్పటి ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వి.అప్పాపురం రైతుల అభ్యర్థన మేరకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు చొరవతో యుద్ధప్రతిపాదికన గెజిట్ నోటిఫికేషన్ విడుదలై రీసర్వే పనులు చేపట్టారు. ఫామ్-8 నోటీసులు జారీ చేసే సమయానికి ఎన్నికల కోడ్ రావటంతో ఈ ప్రక్రియ నిలిచిపోయింది. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఎనిమిది నెలలు గడుస్తున్నా తమ మొర ఆలకించే నాధుడే లేడని రైతులు తీవ్రస్థాయిలో మండి పడుతున్నారు. ఇటీవల ఈనాం భూముల వ్యవహారంపై రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను రైతులు ప్రత్యేకంగా కలిసి తమ సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈనాం భూములకు సంబంధించి సమగ్ర ఆధారాలు అందజేస్తేనే భూహక్కు పత్రాలు అందజేస్తామని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు.

పొలాలు ఉన్నా లేనట్లే..



విలువైన భూములు ఉన్నప్పటికీ క్రయ విక్రయాలు లేకపోవటంతో ఆర్థిక అగచాట్లు పడుతున్నాం. ఆన్‌లైన్‌లో నమోదు కాకపోవటంతో పొలాలు ఉన్నా లేనట్లుగానే అవుతుంది. భూముల విక్రయాలు లేనందువల్ల పిల్లల వివాహాలు చేయలేకపోతున్నాం.

– అల్లూరి రెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు, వి.అప్పాపురం

ప్రభుత్వ ప్రోత్సాహకాలు కోల్పోతున్నాం..



ప్రభుత్వ రికార్డుల్లో మా భూముల సమగ్ర వివరాలు లేనందున భూములుండీ ప్రయోజనం లేకుండా పోతోంది. దీంతో పలు రకాల ఇబ్బందులు పడుతున్నాం. ఈ-క్రాప్ నమోదు లేకపోవటంతో ప్రభుత్వ ప్రోత్సాహకాలు, రాయితీలు, పంట బీమా సౌకర్యాలు కోల్పోతున్నాం.

– నాగిరెడ్డి, రైతు, తిమ్మాపురం

చర్యలు తీసుకుంటాం..

నూజెండ్ల తహసీల్దార్ ఆర్.రమేష్‌కుమార్‌ను వివరణ కోరగా.. కొండప్రోలు గ్రామంలో మఠం భూములు 1603 ఎకరాలు గుర్తించామని, 478 ఎకరాల రైతుల భూములకు సంబంధించి సమగ్ర ఆధారాలను అందజేస్తే అర్హత పత్రాలు ఇస్తామన్నారు. అప్పాపురంలో ఈనాం భూముల హక్కుదారులను గుర్తించి ఫామ్-5 నోటీసులు అందజేస్తామన్నారు. తిమ్మాపురంలో ఇటీవల సర్వే పనులు పూర్తి అయ్యాయని, ఫామ్-1 విడుదల చేయాల్సి ఉందన్నారు.

'ఫైనాన్స్' ఆగడాల నుంచి రక్షించండి

- పీజీఆర్ఎస్‌లో బాధితురాలి వినతి
- ప్రజల నుంచి 62 అర్జీలు స్వీకరించిన జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు



ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి, సమస్యలు ఆలకిస్తున్న కలెక్టర్, జేసీ, అధికారులు

నరసరావుపేట: తన భర్త బాజీవలి స్టార్ ఫైనాన్స్ వద్ద రూ.5లక్షలు రుణం తీసుకొని కరోనా సమయంలో చనిపోయాయని, తాను ఇప్పటివరకు రూ.4.50లక్షలు చెల్లించానని, ఇంకా చెల్లించాలంటూ కోర్టు ఆదేశాల లేకుండానే తమ ఇంటికి తాళాలు వేసిన సదరు ఫైనాన్స్ ప్రతినిధులు నెలరోజులు వేధించారని, వారే ఇప్పుడు తాళాలు తీసి.. ఇంకా రూ.10లక్షలు చెల్లించాలని వేధిస్తున్నారని, తనకు అంత స్థోమత లేదని, వారి ఆగడాల నుంచి రక్షించాలని చిలకలూరిపేట పండరీపురంకు చెందిన సయ్యద్ ఆయేషా ఆవేదన వ్యక్తం చేసింది. సోమవారం కలెక్టరేట్ నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు, జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే, డీఆర్ఓ ఎ.మురళి, అధికారులతో కలిసి పాల్గొని ప్రజల నుంచి 62 అర్జీలు స్వీకరించారు. వచ్చిన అర్జీలను ఆయా శాఖల అధికారులు సత్వరం పరిష్కరించేలా ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి అర్జీకి అర్థవంతమైన సమాధానం ఇస్తూ త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు సూచించారు. మండలాల్లో జీఎస్‌డబ్ల్యుఎస్ సర్వే, పీ-4 సర్వే, ఎంఎస్ఎంఈ సర్వే పురోగతిని కూడా పర్యవేక్షించాలని కోరారు.



సయ్యద్ ఆయేషా,

కొడుకులు ఆస్తి తీసుకొని బాగోగులు చూడట్లేదు

నాకు ఇద్దరు కుమారులు, ముగ్గురు కూతుళ్లు. అందరికీ వివాహాలు అయ్యాయి. భర్త మరణించాడు. నాకు 12 ఎకరాల పొలం ఉండగా ఇద్దరు కుమారులు చెరిసగం తీసుకున్నారు. పదిసవర్ల బంగారాన్ని చిన్నకుమారుడు తీసుకొని బ్యాంకులో పెట్టుకున్నాడు. ఇద్దరిలో ఎవరూ చూడకపోవటంతో ఆడపిల్లల వద్ద ఉంటున్నా. కనీసం తినేందుకు కూడా డబ్బులు ఇవ్వట్లేదు. గుండెజబ్బుకు గురైన నాకు నెలకు కనీసంగా రూ.4వేలు మందులకు కావాలి. పింఛన్ రావట్లేదు. నా బాగోగులు చూసేలా కుమారులకు ఆదేశాలు ఇవ్వండి.

– దావులూరి వీరమ్మ, వృద్ధురాలు, చినకంచర్ల, శావల్యాపురం మండలం

అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు..

నకరికల్లు మండలం దేచవరంలో చర్మకారులైన తమకు ప్రభుత్వం ఒక ఎకరం పొలం కేటాయించగా దానిని సాగుచేసుకుంటూ జీవిస్తున్నాం. గ్రామ టీడీపీ నాయకుడు వెంకయ్య ఈ భూమిని అక్రమంగా ఆన్‌లైన్ చేయించుకొని రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. ఈ అక్రమ రిజిస్ట్రేషన్ రద్దుచేయించి చర్మకారుల సంఘానికి ఆ భూమిని అప్పచెప్పండి.

– కనుమూరి ఆదెయ్య, వై.వెంకటేశ్వరరావు, నల్లపాటి రామారావు, జి.రామకృష్ణ, చర్మకారుల సంఘ నాయకులు

పెత్తందార్ల దౌర్జన్యాలు అరికట్టండి



కారెంపూడి మండలం నరమాలపాడులో బల్ల వెంకటేశ్వర్లు, మునుగోటి సత్యంలు తాము అధికార పార్టీ వాళ్లమని చెబుతూ చెరువు పోరంబోకు భూముల్లో సాగుచేసుకుంటున్న ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల వారిపై దౌర్జన్యం చేసి ఖాళీ చేయాలని బెదిరిస్తున్నారు. మేం ఖాళీచేస్తే వారు చేపల చెరువులుగా మార్చుకుంటామని చెబుతున్నారు. వారిపై చర్యలు తీసుకొని మమ్మల్ని రక్షించండి

– వై.వెంకటేశ్వరరావు, నల్లపాటి రామారావు, ప్రజాసంఘాల నాయకులు, బాధితులు

పరస్పర సహకారంతో అభివృద్ధి



ఐవైసీపై పోస్టర్ ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్, జేసీ, అధికారులు

- ఈ ఏడాది అంతర్జాతీయ సహకార ఏడాదిగా గుర్తింపు
- పోస్టర్ ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్

నరసరావుపేట: ఐక్యరాజ్యసమితి ఈ ఏడాదిని అంతర్జాతీయ సహకార ఏడాదిగా గుర్తించినందున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహకార సంఘాలలో వివిధ కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రణాళిక వేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు పేర్కొన్నారు. దీనికి సంబంధించిన ఐవైసీ పోస్టర్‌ను సోమవారం సంబంధిత అధికారులతో కలిసి కలెక్టర్ కార్యాలయంలో ఆవిష్కరించి, కార్యక్రమం ఉద్దేశాలను వివరించారు.

వేస్ట్ పికర్స్‌కు బల్ల బండ్లు అందజేత..

చెత్తను సేకరించే వృత్తి నుంచి వ్యాపార రంగంలోకి ఎస్టీ యానాదులు మార్పు చెందాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆకాంక్షించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో వేస్ట్ పికర్స్‌కి జీవనోపాధులు మెరుగుపర్చుకునేందుకు నాలుగు చక్రాలు, మూడు చక్రాల బల్లబండ్లను కలెక్టర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. దళిత బహుజన రిసోర్స్ సెంటర్ రీజినల్ కో-ఆర్డినేటర్ మల్లెల చిన్నప్ప, నరసరావుపేట ఏరియా కో-ఆర్డినేటర్ తోకల సాంబయ్య పాల్గొన్నారు.

పీ-4 కార్యాచరణలో భాగస్వాములు కండి

స్వర్ణాంధ్ర-2047లో భాగంగా పేదరికాన్ని పూర్తిగా నిర్మూలించేందుకు పీ4 విధానం అమలుకు కసరత్తు జరుగుతోందని, ఈ ప్రయాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలో సీపీఓ ఆధ్వర్యంలో పీ-4కు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. జేసీ సూరజ్ గనోరే, డీఆర్వో మురళి పాల్గొన్నారు. అదేవిధంగా ఢిల్లీ నుంచి జల్ శక్తి మంత్రిత్వ శాఖ జల్‌శక్తి అభియాన్ 'జల్ సంచయ్ జన్ భగీదారి'పై దేశవ్యాప్తంగా 80 జిల్లాల కలెక్టర్లు, అధికారులతో వర్చువల్ విధానంలో కేంద్ర జల్ శక్తి మంత్రి సీఆర్. పాటిల్ నిర్వహించిన సమీక్షకు కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ హాజరయ్యారు. డ్వామా పీడీ సిద్ధలింగమూర్తి పాల్గొన్నారు.

యువతకు అండగా వైఎస్సార్ సీపీ

- రేపు వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో 'యువత పోరు' కార్యక్రమం
- పోస్టర్లు ఆవిష్కరించిన పార్టీ జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి



యువత పోరు పోస్టర్లు ఆవిష్కరిస్తున్న పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, నాయకులు, కార్యకర్తలు

మాచర్ల: విద్యార్థులు, నిరుద్యోగుల పక్షాన నిలుస్తూ ఈనెల 12వ తేదీన పల్నాడు జిల్లా నరసరావుపేటలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో 'యువత పోరు' నిర్వహిస్తున్నట్లు పార్టీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి తెలిపారు. మాచర్ల పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో కలసి సోమవారం పోస్టర్లు ఆవిష్కరించారు. పిన్నెల్లి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో మోసపోతున్న విద్యార్థులు, యువతకు వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందన్నారు. ఈనెల 12న ఉదయం 10 గంటలకు నరసరావుపేటలోని వైఎస్సార్ సీపీ కార్యాలయం నుంచి 'యువత పోరు' ర్యాలీ ఉంటుందన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయానికి ర్యాలీగా చేరుకుని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తామన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, నిరుద్యోగ యువత పెద్దఎత్తున తరలివచ్చి ప్రభుత్వ మోసపూరిత విధానాలపై గళం వినిపించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలలైనా, ఇప్పటివరకు ఒక్క హామీని కూడా నెరవేర్చలేదన్నారు. ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో సరైన కేటాయింపులు చేయలేదని విమర్శించారు. సీఎం చంద్రబాబు రాష్ట్ర ప్రజలను దారుణంగా మోసం చేశారన్నారు. మహానేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని తెచ్చారని, ఈ పథకం ద్వారా ఎంతో మంది పేదలు ఉన్నత చదువులు చదివారన్నారు. డాక్టర్లు, ఇంజినీర్లుగా స్థిరపడ్డారన్నారు. వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక మరో అడుగు ముందుకు వేసి వసతిదీవెన పథకం కింద హాస్టల్ ఖర్చులు అందజేశారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకానికి తూట్లు పొడుస్తోందని విమర్శించారు. వెంటనే రూ.4,600 కోట్ల బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఫీజుల కోసం కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులపై ఒత్తిడి తెస్తున్నారన్నారు. ఎన్నికల్లో రూ.3 వేల నిరుద్యోగ భృతి, 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చారని, కానీ బడ్జెట్లో ఎక్కడా దీని ప్రస్తావన లేదన్నారు. వై.ఎస్.జగన్ పాలనలో 17 మెడికల్ కళాశాలలకు శ్రీకారం చుడితే, ప్రస్తుత కూటమి ప్రభుత్వం వాటిని ప్రైవేట్ పరం చేయడానికి సిద్ధమవుతోందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వ చర్యలను నిరసిస్తూ చేస్తున్న 'యువత పోరు'లో అందరూ భాగస్వాముల కావాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా ఈనెల 12న వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని నరసరావుపేటలోని జిల్లా కార్యాలయంలో నిర్వహిస్తామని తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని కోరారు.

వెల్దుర్తిలో తీవ్ర విషాదం

- రోడ్డు ప్రమాదంలో తండ్రీ కూతురు మృతి
- ఆగివున్న ట్రాక్టర్‌ను బైక్ ఢీకొట్టగా ఘటన
- ఘటనాస్థలంలోనే మృతి చెందిన వైనం



చిన్నారి రూప మృతదేహం

వెల్దుర్తి: ఆగివున్న ట్రాక్టర్‌ను ఢీకొని తండ్రి కూతురు మృతిచెందిన విషాదకర సంఘటన సోమవారం రాత్రి చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం.. పల్నాడు జిల్లా వెల్దుర్తి మండల పరిధిలోని మిట్టమీదపల్లె గ్రామానికి చెందిన పల్లా శ్రీనివాసరావు (30), తన కుమార్తె రూప (3)తో కలిసి ద్విచక్రవాహనంపై మాచర్ల నుంచి స్వగ్రామం మిట్టమీదపల్లెకు వెళ్తున్నారు. ఈక్రమంలో వేగంగా వెళ్తూ 565 జాతీయ రహదారిలో వెల్దుర్తి సమీపంలోని పెట్రోలు బంకువద్ద రోడ్డు మార్జిన్‌లో నిలుపుదల చేసిన ట్రాక్టర్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో పల్లా శ్రీనివాసరావు, రూపలు తీవ్ర గాయాలపాలై ఘటనా స్థలంలోనే మృతిచెందారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మాచర్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వెల్దుర్తి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



పల్లా శ్రీనివాసరావు మృతదేహం

యార్డుకు 1,61,169 బస్తాలు మిర్చి రాక

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 1,61,169 బస్తాల మిర్చి రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 1,30,718 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల సగటు ధర రూ.9,500 నుంచి రూ.14,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.10,000 నుంచి రూ.14,000 వరకు ధర లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.7,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 74,921 బస్తాలు నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఎ.చంద్రిక తెలిపారు.

బీఈడీ పరీక్ష రద్దు

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ పరిధిలో ఈ నెల 7న జరిగిన బీఈడీ మొదటి సెమిస్టర్ పర్సెక్టివ్ ఇన్ చైల్డ్ డెవలప్మెంట్ పరీక్షను వీసీ ఆచార్య కె.గంగాధర్‌రావు ఆదేశాల మేరకు రద్దు చేశామని సీఈ ఏ శివప్రసాద్‌రావు సోమవారం తెలిపారు. ఈ పరీక్షను ఈ నెల 12వ తేదీన తిరిగి నిర్వహిస్తామని వెల్లడించారు.

న్యాయం జరిగేవరకు పోరాడుతాం

- సమస్య సీఎం దృష్టికి వెళ్లినా పరిష్కారం కాకపోవటంపై అసంతృప్తి
- భవిష్యత్ కార్యాచరణపై పుల్లారావు బాధితుల సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న సాయి సాధన బాధితుల సంఘం ప్రతినిధి సాంబశివరావు

నరసరావుపేట టౌన్: కలిసి కట్టుగా ఉద్యమం చేసి న్యాయం జరిగే వరకు పోరాడదామని సాయి సాధన చిట్‌ఫండ్ స్కాం బాధితులు తీర్మానించుకున్నారు. సాయి సాధన చిట్‌ఫండ్ బాధితులు సోమవారం పట్టణంలోని ఓ హోటల్‌లో సమావేశం అయ్యారు. పాలడుగు పుల్లారావు చిట్‌ఫండ్, విజయలక్ష్మి టౌన్‌షిప్ పేర్లతో కోట్లాది రూపాయలు వసూలు చేసి పరారీ అయిన విషయం విదితమే. రియల్ ఎస్టేట్ మోసంపై పుల్లారావుతో పాటు అతని భాగస్వాములపై గుంటూరు పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌లో చీటింగ్ కేసు నమోదు అవ్వగా, కోర్టులో లొంగిపోయి సబ్‌జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్నాడు. ఆ కేసులో సోమవారం పుల్లారావు అతని భాగస్వాములు గుండా సాంబశివరావు, గుండా అనిల్‌లకు గుంటూరు కోర్టు బెయిల్ మంజూరు చేసింది. నరసరావుపేట వన్‌టౌన్ పోలీసులు నమోదు చేసిన చీటింగ్ కేసులో పుల్లారావుకు బెయిల్ రావాల్సి ఉంది. ఈ నేపథ్యంలో భవిష్యత్ కార్యాచరణపై బాధితులంతా సమావేశమై చర్చించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి సమస్య తీసుకువెళ్లినా న్యాయం జరగలేదని కొందరు అభిప్రాయబడ్డారు. కేసు సీఐడీకి బదిలీ అయినప్పటి నుంచి పుల్లారావు కుటుంబ సభ్యులను అరెస్ట్ చేయటంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారని పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించి న్యాయం చేసే వరకు అవసరమైతే రిలే నిరాహార దీక్షలు చేద్దామని చర్చించుకున్నారు. చీటీపాట స్కాంలో ఉన్న బాధితులు సుమారు 600 మందితో త్వరలోనే సమావేశమై తుది నిర్ణయం తీసుకుంటామని కమిటీ సభ్యులు చేకూరి సాంబశివరావు, ఇ.ఎం.స్వామి, యామిని రామారావు తెలిపారు.

● 13న జాబ్‌మేళా

మాచర్ల: ఏపీఎస్‌ఎస్‌డీసీ ఆధ్వర్యంలో ఈనెల 13న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు పల్నాడు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి తమ్మాజీరావు సోమవారం తెలిపారు. మాచర్ల ఎస్‌కేబీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణంలో మేళా జరుగుతుందని వివరించారు.

పోలీస్ గ్రీవెన్స్‌కు 106 ఫిర్యాదులు



ఎస్పీ శ్రీనివాసరావుకు సమస్యను వివరిస్తున్న బాధితులు

నరసరావుపేట: జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్)కు ఎస్పీ కంచి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితుల నుంచి అర్జీలు స్వీకరించారు.

కుటుంబ, ఆర్థిక, ఆస్తి తగాదాలకు సంబంధించి 106 ఫిర్యాదులు అందాయి. వచ్చిన ఫిర్యాదులను తక్షణం పరిష్కరించాలని ఎస్పీ పోలీస్ అధికారులను ఆదేశించారు.

నాకు, నా కుటుంబానికి రక్షణ కల్పించండి



టైలరింగ్ చేస్తూ జీవిస్తుంటాను. నా ఇంటి పక్కనే ఉండే పూజల కోటేశ్వరరావు గతంలో నా భార్య పట్ల అనుచితంగా ప్రవర్తించటంతో పోలీసులకు ఫిర్యాదు చేశాను. కోర్టులో అతనికి రెండేళ్ల శిక్ష పడింది. అతనిపై పోలీసు స్టేషన్‌లో రౌడీషీటు కూడా ఉంది. శిక్షాకాలం పూర్తిచేసుకుని వచ్చిన అతను నాపై కత్తితో దాడి చేయటంతో నేను తీవ్రంగా గాయపడి చికిత్స పొంది కోలుకున్నా. కత్తితో దాడి చేసిన కేసు ఉపసంహరించుకోవాలని, లేకుంటే చంపుతానని కోటేశ్వరరావు, బ్రహ్మమ్మలు మమ్మల్ని బెదిరిస్తున్నారు. వారిపై చర్యలు తీసుకొని మా కుటుంబానికి తక్షణం రక్షణ కల్పించండి.

– బుర్రి వెంకటరావు, బయ్యవరం, క్రోసూరు మండలం

ఉద్యోగం ఇప్పిస్తానని రూ.2.5 లక్షలు కాజేశారు

నాకు కడప జిల్లాకు చెందిన జబ్బిరెడ్డి ప్రభాకరరెడ్డి మూడున్నరేళ్ల క్రితం పరిచయమయ్యాడు. తాను సెక్రటేరియట్‌లో ఉద్యోగం చేస్తున్నట్లు చెప్పాడు. ఖాళీగా ఉన్న నా కుమారుడి విషయం చెప్పగా రూ.5 లక్షలు ఇస్తే ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పాడు. నేను రూ.2.5 లక్షలు ఇచ్చాను. అప్పటి నుంచి అతను ఉద్యోగం ఇప్పించకపోగా డబ్బు అడిగితే చంపుతానని బెదిరిస్తున్నాడు.

– ఆసుల జగన్, గంగిరెడ్డిపాలెం, బెల్లంకొండ మండలం

స్థలం డాక్యుమెంట్ ఇవ్వాలని కొట్టారు

నేను చిలకలూరిపేట రోడ్డు ఓవర్ బ్రిడ్జి పక్కన గల లూథరన్ హైస్కూల్ మెయిన్ గేటు పక్కన స్థలం కొనుగోలు చేశాను. ఆ సమయంలో విక్రయించిన లూథరన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు 14 మంది సంతకాలు చేసి పాస్టర్ స్టాంపు వేశారు. ఇప్పుడు ఆ స్థలంలో ప్రీతికుమార్, రత్నకుమార్ అక్రమంగా గోడలు కడుతుండగా ఈనెల 6న నిలదీశాను. దీంతో నాపై దాడిచేసి కొట్టారు. స్థలానికి చెందిన ఒరిజినల్ డాక్యుమెంట్ అప్పగించాలని బెదిరిస్తున్నారు.

–కాటుమాల సంగీతరావు, ఎల్‌టీనగర్, చిలకలూరిపేటరోడ్డు

స్వాధీనం చేసుకున్న ఇంటిని విడిపించండి

నేను రామ్మూర్తి అనే వ్యక్తి నుంచి రూ.10 లక్షలు అప్పుగా తీసుకుని చెల్లించలేకపోయాను. అతను నా ఇల్లు, భూమి ఆక్రమించుకున్నాడు. నాకు ఆ భూమే జీవితాధారం. వాటిని తిరిగి విడిపించి న్యాయం చేయండి.

– నార్ల లక్ష్మణరావు, పల్లెగుంత, గురజాల మండలం

కళా సాధనకు నిరంతరం కృషి చేయాలి

- ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ డైరెక్టర్ రాసంశెట్టి నరసింహారావు
- జాతీయ స్థాయి సినిమా పాటల పోటీల విజేత విజయవాడ మాధవి



బహుమతులు అందుకున్న విజేతలతో రాసంశెట్టి నరసింహారావు

సత్తెనపల్లి: ప్రతి మనిషిలో ఓ కళ ఉంటుందని, ఆ కళని సాధించడానికి నిరంతర కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ డైరెక్టర్ రాసంశెట్టి నరసింహారావు అన్నారు. చైతన్య కళా స్రవంతి సత్తెనపల్లి 46వ వార్షికోత్సవం సందర్భంగా జాతీయ స్థాయి తెలుగు సినిమా పాటల పోటీలు పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాల్లో ఆదివారం నిర్వహించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. నరసింహారావు ముఖ్య అతిథిగా మాట్లాడుతూ వర్ధమాన గాయకులు విజయపథం వైపు పయనించాలని ఆకాంక్షించారు. జాతీయస్థాయి తెలుగు సినిమా పాటల పోటీలలో ప్రథమ బహుమతి మాధవి (విజయవాడ), ద్వితీయ బహుమతి కె.రామారావు (కారంపూడి), తృతీయ బహుమతి కె.దుర్గాప్రసాద్ (హైదరాబాద్) కైవసం చేసుకున్నారు. వీరితో పాటు 10 మంది కన్సొలేషన్ బహుమతులు, 15 మంది ప్రత్యేక బహుమతులను అందుకున్నారు. బహుమతి ప్రదానోత్సవానికి చైతన్య కళా స్రవంతి గౌరవ సలహాదారు లయన్ ముట్లూరి వెంకయ్య అధ్యక్షత వహించారు. పోటీలకు న్యాయ నిర్ణేతలుగా ఎ.విశ్వేశ్వరరావు(పిడుగురాళ్ల), ఎస్.కళాంజలి(రాజంపేట), ఎం.రవివర్మ (నరసరావుపేట) వ్యవహరించారు. కార్యక్రమంలో వ్యాపారవేత్త పోతుగంటి రామ కోటేశ్వరరావు, శ్రీమారుతీ ట్రేడర్స్ అధినేత ఆత్మకూరి వెంకట హరేరామచెంచయ్య, వెంకటసుబ్బయ్య, కళాస్రవంతి అధ్యక్షుడు లయన్ కమతం శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి గుండ వరపు అమర్ నాథ్, ట్రెజరర్ ఎస్‌సీయం. సుభాని, మహేష్, బాలరాజు, ఆచారి, అచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చేతివృత్తులపై నైపుణ్య శిక్షణ



శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు అందిస్తున్న తమ్మాజీరావు

నరసరావుపేట ఈస్ట్: చేతి వృత్తులకు సంబంధించి అత్యాధునిక నైపుణ్య శిక్షణను పొందటం ద్వారా ఉద్యోగ, ఉపాధి పనులలో గొప్ప స్థాయికి వెళ్లగలరని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఇ.తమ్మాజీరావు తెలిపారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో వివిధ చేతివృత్తుల వారికి అత్యుత్తమ శిక్షణను అందిస్తున్నట్టు వివరించారు. ప్రధానమంత్రి విశ్వకర్మ చేతివృత్తి కోర్సు పథకం ద్వారా సింక్రో సర్వ్ గ్లోబల్ సొల్యూషన్స్ ద్వారా శిక్షణ పొందిన వారికి సోమవారం సర్టిఫికెట్లు అందచేశారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న తమ్మాజీరావు మాట్లాడుతూ పదవ తరగతి, ఇంటర్మీడియెట్, డిగ్రీ పూర్తి చేసిన నిరుద్యోగ యువతకు ఐటీ, పైథాన్, డ్రోన్ సర్వీస్ టెక్నీషియన్, బేసిక్ కంప్యూటర్ కోర్సులలో ఉచితంగా శిక్షణ ఇస్తామని, ఉద్యోగ, ఉపాధి కల్పనలో సహరిస్తామని స్పష్టం చేశారు. ఆసక్తి గలవారు 6301851503, 6301851504 నంబర్లలో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో అదనపు జిల్లా నైపుణ్యాధికారి రామాంజనేయులు, సెంటర్ ఇన్‌చార్జ్ నవీన్, శశిధర్ పాల్గొన్నారు.

తిరునాళ్లకు వెళ్లి వస్తూ తిరిగిరాని లోకాలకు..

- రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి
- మరొకరికి తీవ్ర గాయాలు



ఘటన స్థలంలో మృతుడు నాగేశ్వరరావు, క్షతగాత్రుడు ఆంజనేయులు

రెంటచింతల: పాలువాయి గేటు గ్రామంలో సోమవారం తెల్లవారు జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. గోలి గ్రామానికి చెందిన మాచవరపు నాగేశ్వరరావు(45), బాలగాని ఆంజనేయులు ఇద్దరూ కలిసి ద్విచక్ర వాహనంపై దుర్గి మండలంలోని ముటుకూరు తిరునాళ్లకు వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. జాతీయ రహదారి 167 ఏడీ నిర్మాణంలో భాగంగా పాలువాయి గేటు గ్రామంలోని రైల్వే ట్రాక్ వద్ద చేపట్టిన హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం పూర్తి కాకపోవంతో రాత్రి సమయం కావడం వల్ల ముందు ఏమీ కనిపించకపోవడంతో ఒక్కసారిగా ద్విచక్రవాహనంతో బ్రిడ్జిపై నుంచి ఇద్దరూ కింద పడిపోయారు. దీంతో తీవ్రంగా గాయపడిన వారిద్దరినీ తొలుత నర్సరావుపేటలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వారిలో మాచవరపు నాగేశ్వరరావు ఆస్పత్రిలో చికిత్సపొందుతూ మృతి చెందాడు. బాలగాని ఆంజనేయులును మెరుగైన వైద్యం కోసం గుంటూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అతని పరిస్థితి కూడా విషమంగా ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు. బ్రిడ్జి నిర్మాణంలో ఉన్నట్లు ఆ ప్రాంతంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడం వల్ల ఈ ప్రమాదం జరిగినట్లు బాధితుల కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. నాగేశ్వరరావుకు భార్య ఏసమ్మ, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సీహెచ్ నాగార్జున తెలిపారు.

విద్యుదాఘాతంతో లైన్‌మెన్ మృతి

క్రోసూరు: పీసపాడు సబ్‌స్టేషన్ పరిధిలో లైన్‌మెన్‌గా పనిచేస్తున్న గుజ్జర్లపూడి రామారావు(45) సోమవారం విద్యుదాఘాతంతో మృతి చెందాడు. క్రోసూరు మండల విద్యుత్ శాఖ ఏఈ బసవరాజు కథనం ప్రకారం. పారుపల్లిలోని ఓ రైతు పొలంలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్న క్రమంలో పీసపాడు సబ్‌స్టేషన్ నుంచి వచ్చే లైన్ సప్లయిని ఆఫ్ చేసుకుని రామారావు పనిచేస్తున్నాడు. అయితే దురదృష్టవశాత్తు క్రోసూరు నుంచి వచ్చే లైన్ ద్వారా విద్యుత్ ప్రసరించటంతో విద్యుదాఘాతానికి గురై అక్కడి నుంచి కింద పడిపోయాడు. అతనిని హుటాహుటిన సత్తెనపల్లి ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్న క్రమంలో బ్రెయిన్ డెడ్ అయి మృతి చెందాడని వైద్యులు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఘటనపై పోలీసుస్టేషన్‌లో ఏఈ ఫిర్యాదు చేశారు. రామారావు సత్తెనపల్లిలో నివాసముంటూ పీసపాడులో విధులు నిర్వహిస్తున్నాడు. ఈయన అందరికీ సుపరిచితుడు. నాలుగేళ్ల నుంచి లైన్‌మెన్‌గా పనిచేస్తున్న రామారావు మరణం ప్రజలను కలచివేసింది.

ఉత్సాహంగా జాతీయస్థాయి ఎడ్ల పందేలు



ఆకుల గణపవరంలో ఆరుపళ్ల విభాగంలో పోటీ పడుతున్న ఎడ్ల జత

రాజుపాలెం: మండలంలోని ఆకుల గణపవరంలో ప్రసన్నాంజనేయ స్వామి జయంత్యుత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న జాతీయ స్థాయి ఎడ్ల పందేలు సోమవారం రసవత్తరంగా జరిగాయి. ఆరు పళ్ల విభాగంలో బాపట్ల జిల్లా చుండూరు మండలం వేటపాలెం గ్రామానికి చెందిన అత్తోట శిరీష, శివకృష్ణచౌదరికి చెందిన ఎడ్ల జత 4,250 అడుగుల దూరం లాగి ప్రథమ స్థానం కైవసం చేసుకుంది. కృష్ణాజిల్లా విజయవాడకు చెందిన వల్లభనేని మోహన్‌రావు, ఉత్తం పద్మావతిరెడ్డి ఎడ్ల జత 4,000 అడుగుల దూరం లాగి ద్వితీయ స్థానం, పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం కేసానుపల్లి గ్రామానికి చెందిన నెల్లూరి రామకోటయ్య ఎడ్ల జత 3,783 అడుగుల దూరం లాగి తృతీయ స్థానం, సూర్యాపేట జిల్లా మేళ్లచెరువు గ్రామానికి చెందిన పాశం గోవర్ధనరెడ్డి, రాయుడు సుబ్బారావు ఎడ్ల జత 3,500 అడుగుల దూరం లాగి నాలుగో స్థానం, ప్రకాశం జిల్లా గిద్దలూరు మండలం అక్కలరెడ్డిపల్లికి చెందిన కూతర్ల దీక్షిత్‌రెడ్డి, నిశాంత్‌రెడ్డికి చెందిన ఎడ్లజత 3,380 అడుగుల దూరం లాగి ఐదో స్థానం సాధించాయి. మంగళవారం జూనియర్స్ విభాగంలో పందేలు జరగనున్నాయని కమిటీ సభ్యులు తెలిపారు. రోజూ పందేలు తిలకించేందుకు వచ్చే రైతులకు అన్నదానం చేస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.